క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవ పూజలు



కల్యాణ వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

దెంకాడ: మండల కేంద్రంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుని కల్యాణం కనుల పండువగా చేట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న టూటౌన్, కేంద్ర పోలీసు బలగాలు

విజయనగరం క్రైమ్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని టూటౌన్ సీఐ కోరాడ రామారావు కోరారు. స్టేషన్ పరిధిలోని దాసన్నపేట, లంక వీధి, కాటవీధి, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో బుధవారం పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని సూచించారు. రాజకీయ గొడవల్లో తలదూర్చవద్దన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సివిల్ పోలీసులు, కేంద్ర బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

ఎంపీడీఓ పర్యటన



వల్లూరులో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రామారావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు, బొప్పడాం గ్రామాల్లో ఎంపీడీఓ గిడుతూరి రామారావు బుధవారం పర్యటించారు. ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లు, సచివాలయాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటు ప్రాముఖ్యతపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి మే 22 లోపు ఆన్‌లైన్‌లో ప్రవేశ రుసుం చెల్లించి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఓసీ, బీసీ, ఈబీఎస్ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ : మండలంలోని కోనాడ జంక్షన్ సమీపంలో మోటార్‌సైకిల్‌పై మద్యం తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 50 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ కె.సురేష్ తెలిపారు. కొల్లయివలసకు చెందిన వెల్దాటి రామసూరి, వెల్దూరుకు చెందిన గుమ్మడి పైడిరాజులు కలిసి మోటార్‌సైకిల్‌పై మద్యం సీసాలు తీసుకువస్తుండగా.. పట్టుబడ్డారన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. తనిఖీల్లో ఎస్ఈబీ సిబ్బంది సింహాచలం, పోలినాయుడు, గౌరు, మేరీ గ్రేస్, తదితరులు ఉన్నారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్ : మండల పరిధిలోని వీటీ అగ్రహారం శివారులో పేకాటాడుతున్న పది మందిని రూరల్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 8,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై వాసుదేవ్ తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, రూరల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెరువు గట్టు.. అదిరేట్టు..



చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్



నగరంలోని అచంటా గార్డెన్స్

- నగరంలో చెరువులకు కొత్త కళ
- ఐదేళ్లలో రూపుమారిన ప్రధాన చెరువులు
- గట్టులపై వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ పరికరాల ఏర్పాటు
- ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్న నగరవాసులు



సింగపూర్ సిటీ వద్ద గల నీలాటి చెరువు

విజయనగరం: నగరంలోని చెరువులు కొత్త కళను సంతరించుకున్నాయి. ఒకప్పుడు తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ విషసర్పాలకు ఆవాసంగా ఉండే చెరువులు గడిచిన ఐదేళ్లలో ఆహ్లాదాన్ని పంచే ప్రదేశాలుగా మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనలతో నగరంలోని వివిధ చెరువులను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దారు. చెరువుల చుట్టూ గట్లు నిర్మించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంతో పాటు వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించేందుకు వచ్చే వారి కోసం బెంచీలు ఏర్పాటు చేశారు. దీంతో ప్రతిరోజూ ఆయా ప్రాంతాల్లోని చెరువు వద్దకు వచ్చేవారు వ్యాయామ సాధన చేస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు బాటలు వేసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా చెరువులు అభివృద్ధి చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- రూ. 1.60 కోట్లతో నగర శివారుల్లో గల నీలాటి చెరువును అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, రెండు ఫౌంటైన్లు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి నుంచి చెరువు వరకు విద్యుత్ దీపాలంకరణలు చేశారు.
- నగరం నడిబొడ్డున గల అయ్యకోనేరును లక్షలాది రూపాయలతో సుందరంగా తీర్చిదిద్దారు. కోనేరు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక నగరమైన విజయనగరంలో వివిధ రకాల కళలు ప్రదర్శించేందుకు అవసరమైన వేదికను ఏర్పాటు చేశారు.
- ఒకప్పుడు తీవ్ర దుర్గంధం, విషసర్పాలకు ఆవాసమైన బుచ్చన్న కోనేరు చెరువు ప్రస్తుతం సుందరంగా దర్శనమిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.65 లక్షలతో కోనేరును అభివృద్ధి చేశారు. చెరువును శుభ్రం చేసి వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు.
- రూ.1.30 కోట్లతో అచంటా గార్డెన్స్‌ను అభివృద్ధి చేశారు. మూడు ఫౌంటైన్‌లు ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు ఆహ్లాదాన్ని పంచేలా మొక్కలు వేశారు. అలాగే పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. పార్కు పరిసరాలు అందంగా కనిపించేలా విద్యుత్ దీపాలంకరణ చేశారు. బుద్ధుడి విగ్రహం, ఐ లవ్ విజయనగరం పేరిట రెండు ఐకాన్‌లు ఏర్పాటు చేశారు.
- అయ్యన్నపేట కోమటి చెరువును రూ.55 లక్షలతో అభివృద్ధి చేశారు. చెరువు చూట్టూ వాకింగ్ ట్రాక్, బెంచీలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం..

నగరంలో వివిధ చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం. ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం చేరువైంది. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు పాడుచేయకుండా నిత్యం పర్యవేక్షిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే చెరువుల వద్ద వాకింగ్ చేసే వారి సంఖ్య పెరిగింది. ఒకప్పుడు మైదానాలకు వెళ్లేవారు ఇప్పుడు సమీపంలో ఉన్న ప్రాంతాలకు వెళ్లి వ్యాయామ సాధన చేసుకుంటున్నారు.

– ఎస్. శంకరరావు, వాకర్, సింగపూర్‌సిటీ



అయ్యన్నపేట కోమటి చెరువు

జగనన్నతోనే ప్రజారంజక పాలన

- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకే ఓటు వేయండి
- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



జీఆర్‌పాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని, ప్రజారంజక పాలన ఆయనతోనే సాధ్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని కనిమెట్ట, గుండపురెడ్డిపాలెం, కందివలస గ్రామాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఇంతవరకు ఎవరూ చేయని విధంగా పేదలు, మహిళలు, ఇతర అన్నివర్గాల ప్రజలకు మంచి చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రాష్ట్రంలో కోటీ 20 లక్షల మంది లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలకు రూ. 1.75 కోట్లు జమ చేశారని చెప్పారు. ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుడి ఖాతాకు జమచేయడం నిజంగా గొప్ప విషయమన్నారు. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణమాఫీ, జీరో వడ్డీ ఇస్తానని హామీ ఇచ్చి దగా చేశారని గుర్తు చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ ఆసరా కింద రుణమాఫీ చేయడంతో పాటు వైఎస్సార్ చేయూత పథకం కింద ఒక్కో మహిళకు రూ. 18,750 చొప్పున జమ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని చింతపల్లిలో మత్స్యకారులకు ఫ్లోటింగ్ జెట్టీ.. భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు.. కుమిలిలో రామతీర్థసాగర్ రిజర్వాయర్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలను మోసం చేయడానికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కూటమి పేరుతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేసిన జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణరాజు, దాడిశెట్టి త్రినాథరావు, కొత్తకోట శ్రీరాములు, పుప్పాల లక్ష్మీనారాయణ, లంకలపల్లి రాజారావు, బొల్లు రమేష్, రౌతు సాయి కుమార్, వాళ్లె సన్యాసినాయుడు, బర్రి చినఅప్పన్న, గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, కోట్ల రఘు, మహంతి లక్ష్మణరావు, పి.నారాయణరావు, నడిపేన రమణ, ఎర్ల రామకృష్ణ, శాంతాటి శ్రీనివాసరావు, దేశెట్టి గణేష్, చావల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



అగ్ని ప్రమాద బాధితులకు సరుకులు అందజేస్తున్న బంగారునాయుడు, తదితరులు

విజయనగరం: నగరంలోని 19వ డివిజన్ లంకాపట్నం వద్ద పోలమాంబ గుడి సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, స్థానిక కార్పొరేటర్ పొట్నూరు శ్రీనివాసరావు, తదితరులు పరామర్శించి అవసరమైన నిత్యవసరాలు, దుస్తులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనలతో అగ్నిప్రమాద బాధితులను పరామర్శించామన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

దాడులు ముమ్మరం

నెల్లిమర్ల: ఎస్ఈబీ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. గుర్ల మండలంలోని రౌతుపేటలో బుధవారం దాడులు చేపట్టి 1400 లీటర్ల బెల్లం ఊట, 20 లీటర్ల సారా గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం నెల్లిమర్ల ఎస్ఈబీ కార్యాలయంలో జరిగిన ఇన్‌స్పెక్టర్ పీటీవీ కుమార్ మాట్లాడుతూ... సారా తయారు చేసినా, అమ్మకాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ వై. భాస్కర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కానిస్టేబుల్ వి. కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఆర్‌బీకే

- సొంత గ్రామాల్లోనే అందుతున్న సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



సవరవిల్లి రైతు భరోసా కేంద్రం

భోగాపురం: గత టీడీపీ హయాంలో అన్నదాత కష్టాలను ఎవ్వరూ పట్టించుకోలేదు. కాని ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నం. పాదయాత్రలో రైతుల కష్టాలు కళ్లారా చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అన్నదాతకు అండగా నిలబడ్డారు. విత్తనం నుంచి విక్రయం వరకు ప్రతి దశలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు సకల సేవలను అందించేందుకు ప్రతి సచివాలయ పరిధిలో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడవి ఊరూరా రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాల్లో ఉండే వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు వారి సొంత గ్రామాల్లోనే అన్ని రకాల సేవలు పొందుతున్నారు. ఆర్‌బీకేల్లో భూసార పరీక్షలు నిర్వహించడం రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల్లో సుమారు 7000 మంది రైతులకు సేవలందిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సుమారు 1700 ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. దీంతో పాటు 2,500 ఎకరాల్లో కొబ్బరి.. వెయ్యి ఎకరాల్లో జీడి మామిడి.. 150 ఎకరాల్లో మొక్కజొన్న.. 105 ఎకరాల్లో కూరగాయలు పండిస్తుంటారు. పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ అవసరమైన సలహాలు, సూచనలు గ్రామంలోనే అందివ్వడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మండల వ్యాప్తంగా 364 మంది రైతులకు పంట రుణ అర్హత కౌలు కార్డులు పంపిణీ చేశారు. నాలుగేళ్లలో రైతులకు రెండు వరి కోత యంత్రాలు, ఐదు పెద్ద ట్రాక్టర్లు, 4 పవర్ వీడర్లు, 4 రోటీవీడర్లు పంపిణీ చేశారు.

కియోస్కోలతో ఎన్నో ప్రయోజనాలు..

ఆర్బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతోంది. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను 48 గంటల్లో నేరుగా రాయితీపై రైతులకు అందిస్తున్నారు.

ఈ–క్రాప్ నమోదు

ప్రతి రైతు వారు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుఫాన్ల కారణంగా పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందే అవకాశం కలిగింది. ఈ–క్రాప్ సర్టిఫికెట్ ద్వారా రైతులకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తున్నారు.

తక్కువ ధరకే ఎరువులు, విత్తనాలు

రైతుభరోసా కేంద్రాల్లో ప్రభుత్వం అన్ని రకాల ఎరువులు, విత్తనాలను రైతులకు రాయితీపై అందిస్తోంది. సీజన్‌తో సంబంధం లేకుండా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, విత్తనాలు ఆర్బీకేల్లో లభ్యమవుతున్నాయి.

ఇంత లబ్ధి ఎప్పుడూ లేదు..



నాకు రైతు భరోసా పథకం ద్వారా నాలుగు సార్లు రూ. 54 వేలు వచ్చింది. మూడు సార్లు పంటల బీమా ద్వారా రూ.68 వేలు, సున్నావడ్డీ రూపేణా రూ.3 వేలు అందింది. నేను 32 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. ఒక రైతుగా ఇంత లబ్ధి ఎప్పుడూ అందుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలబడుతోంది.

– పిడుగు లక్ష్మణరావు, రైతు, ముంజేరు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



నాకు రైతు భరోసా పథకం ద్వారా మూడు విడతల్లో రూ. 40,500.. సున్నావడ్డీ రూపేణా రూ. 10 వేలు వచ్చింది. రైతుభరోసా కేంద్రాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లో చేపట్టే ఈ క్రాప్ బుకింగ్‌తో ప్రయోజనం కలుగుతోంది. ప్రకృతి వైపరిత్యాలతో పంటకు నష్టం వాటిల్లితే పంటల బీమా అందిస్తున్నారు. రైతుల కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం

– ముద్దాడ ఆదినారాయణ, కౌలురైతు, సవరవిల్లి

బంగారు వస్తువు అప్పగింత



బాధితులకు బంగారు వస్తువు అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్సై లోవరాజు, కానిస్టేబుల్ సత్యనారాయణ, తదితరులు

విజయనగరం క్రైమ్: చేజార్చుకున్న బంగారు వస్తువును ట్రాఫిక్ పోలీసులు బాధితులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక చింతలవలస గుండాలపేటకు చెందిన రామునాయుడు కుటుంబ సభ్యులతో కలిసి గంటస్తంభం వద్ద గల నగల దుకాణంలో అరతులం చైన్ బుధవారం కొనుగోలు చేశాడు. అనంతరం దుస్తులు కొనేందుకు వేరే దుకాణం వద్దకు వెళ్లి బంగారు వస్తువు జారవిడుచుకున్నాడు. ఆ వస్తువును ట్రాఫిక్ కానిస్టేబుల్ సత్యనారాయణ, హోంగార్డు కాశీ గుర్తించి విషయాన్ని ట్రాఫిక్ ఎస్సై లోవరాజుకు తెలియజేశారు. దీంతో బిల్ ఆధారంగా బంగారు దుకాణం వద్దకు వెళ్లి కొనుగోలు చేసిన వారిని గుర్తించారు. వెంటనే బాధితులకు ఫోన్ చేసి రప్పించి బంగారు వస్తువు అందజేశారు. దీంతో బాధితులు ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అవగాహన తప్పనిసరి



పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారులు

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు తెలిపారు. జమ్ము జంక్షన్ వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సిబ్బందికి అగ్నిప్రమాదాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది, పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయం

- నగర పాలక సంస్థ కమిషనర్ మల్లయ్యనాయుడు




ఆర్యవైశ్య అసోసియేషన్ భవన ఆస్తి పన్నును ఏకకాలంలో కట్టిన చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

విజయనగరం: ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు దీర్ఘకాలికంగా బకాయి ఉన్న ఆర్యవైశ్య అసోసియేషన్ భవన ఆస్తి పన్నులు బుధవారం ఏకమొత్తంలో చెల్లించి వడ్డీ మాఫీ పొందారు. వాస్తవంగా భవన ఆస్తి పన్ను మొత్తం కోటీ 64 లక్షల 18,899 రూపాయలు కాగా.. ప్రభుత్వం వడ్డీమాఫీ ప్రకటించడంతో కేవలం 61 లక్షల 17,239 రూపాయలు చెల్లించారు. కేదారిశెట్టి సీతారామమూర్తి, రవ్వ శ్రీనివాస్, ఎంసీహెచ్ గుప్తా, కాపుగంటి ప్రకాష్, తదితరులు కమిషనర్ చాంబర్‌కు వచ్చి పన్ను చెల్లించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు మాట్లాడుతూ.. వడ్డీ రాయితీ విధానం పట్ల పలువురు ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు. ఈ నెల 31వ తేదీ వరకు వడ్డీ రాయితీ విధానం అమలులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వినోద్, కిరణ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి బ్లడ్ బ్యాంక్

- రూ.75 లక్షలతో సీహెచ్‌సీ ఆవరణలో నిర్మాణం



అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మించిన బ్లడ్ బ్యాంక్

చీపురుపల్లి: స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స తీసుకునే వారికి అత్యవసర సమయాల్లో రక్తం కావాలంటే విజయనగరం, విశాఖపట్నం పరుగులు తీయాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. సీహెచ్‌సీలో రక్త నిల్వ కేంద్రం ఉన్నప్పటికీ అరకొరగా బ్లడ్ ప్యాకెట్లను మాత్రమే నిల్వచేసే సదుపాయం ఉండేది. ఇక్కడి ఆస్పత్రిలో ప్రతి నెలా వందల సంఖ్యలో ప్రసవాలు జరుగుతుండడంతో పాటు అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలకు చెందిన క్షతగాత్రులు చేరుతుంటారు. ఇక్కడ అత్యవసర సేవలు సైతం అందుబాటులో ఉన్నాయి. అందుకే బ్లడ్ బ్యాంక్ అవసరమని స్థానిక ప్రజాప్రతినిధులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి గతంలో తీసుకెళ్లారు. తక్షణమే వారు స్పందించి, అరబిందో ఫార్మా ఫౌండేషన్ వ్యవస్థాపకులతో మాట్లాడి చీపురుపల్లిలో బ్లడ్ బ్యాంక్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. దీంతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ముందుకొచ్చి సీఎస్ఆర్ నిధులు రూ.75 లక్షలతో బ్లడ్ బ్యాంక్ భవనంతో పాటు యంత్రాలు, ఫర్నీచర్, మౌలిక వసతులు కల్పించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకు అప్పగించారు. కొద్ది రోజుల క్రితమే బ్లడ్ బ్యాంక్‌ను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. బ్లడ్ బ్యాంక్‌కు నిరంతర విద్యుత్ సరఫరా అవసరం ఉన్న నేపథ్యంలో జనరేటర్‌ను సమకూర్చాల్సి ఉంది. జనరేటర్ సదుపాయం కల్పించే పనిలో ప్రజాప్రతినిధులు ఉన్నారు. త్వరలో ఇక్కడ సేవలు ప్రారంభంకానున్నాయి.

B.Ed. Spot Admissions - 2023-25
CHANAKYA COLLEGE OF EDUCATION (CCKV)
KANAPAKA (Vill), VIZIANAGARAM Dist.

Candidate may seek admissions against 28 vacancies in all methodologies (Maths, Physics, Biology, Social, English) interested candidates may meet the Principal along with the original certificates immediately candidate should be qualified in Edcet-2023 or Without Edcet-2023. Admissions will be done as per Edcet-23 spot admissions guidelines and along with CAT-A EWS (05 Nos) seats also available. Date of Admissions : 30-03-2024 to 03-04-2024.

Contact :8639914408, 9618869684 Sd/- Principal

CHANAKYA COLLEGE OF EDUCATION (CCKV)
KANAPAKA Vill, VIZIANAGARAM Dist
B.Ed., Management Quota (Category-B) 2023-2025

Application are invited from Qualified students (with or without Edcet-2023) Who have completed their graduation in B.A / B.Sc / B.Com/ BBM/ BCA with 50% for OC and 45% for reserve castes like SC / ST / BC and PH category for B.E. and B.Tech Courses 55% in required for admissions into B.Ed course in all methodologies. Interested candidates can apply in person or by post from 30-03-2024 to 03-04-2024. For any clarification kindly contact the below mentioned phone numbers.

Contact :8639914408, 9618869684 Sd/- Principal